విలేకరులు కావలెను

తెలంగాణ వాణి

TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.

పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143



TELANGANA VANI TELUGU DAILY

R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV

THE VOICE OF TELANGANA

ఎడిటర్ జేరిపోతుల సంపత్

9912758107

సంపుటి: 16 | సంచిక : 130 | గురువారం 10. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


## రైల్వే విస్తరణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- ఏడు రద్దీ కారిడార్లలో నాలుగు లైన్లు
- 11 వేల కోట్లతో మల్టీట్రాకింగ్ పనులు
- ఐదు రాష్ట్రాల్లోని 14 జిల్లాలకు ప్రయోజనం
- తెలుగు రాష్ట్రాలకూ భారీగా లబ్ది



4

## మా ఆదేశాలనే ధిక్కరిస్తారా.. అంత ధైర్యం ఎలా వచ్చింది?

విద్యార్థికి నోటీసుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- చర్యలు వద్దని చెప్పినా ఎలా ఇచ్చారని ప్రశ్న
- మేజిస్ట్రేట్ తీరుపై ధర్మాసనం మండిపాటు
- జిల్లా అధికారుల నుంచి వివరణ కోరనున్న కోర్టు

నోటీసును వెనక్కి తీసుకున్నట్లు వెల్లడి

4



# కుట్రదారులెవరైనా వదిలిపెట్టం!

## వరుస ఘటనలపై సమగ్ర విచారణ



దోషులపై క్రిమినల్ కేసులు ■ స్పీకర్‌కు ప్రభుత్వం అండగా ఉంటుంది

ప్రజా సమస్యలపై చర్చను అడ్డుకున్నారని ఆరోపణ

అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

**శాసనసభ వర్షాకాల సమావేశాల ప్రారంభంలో చోటుచేసుకున్న కుట్రపూరిత సంఘటనలను ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని సభా నాయకుడు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఉదంతంలో భాగస్వాములైన బాధ్యులందరిపై సమగ్ర విచారణ జరిపించి, క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని ఆయన ప్రకటించారు. సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారిని ఉద్దేశించి దుర్భాషలాడటం, దళితులు నడిచిన నేలను శుద్ధి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం శాసనసభలో జరిగిన సుదీర్ఘ చర్చకు సీఎం సమాధానమిచ్చారు.**

హైదరాబాద్ తెలంగాణ వాణి) శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో చోటుచేసుకున్న ఘటనల వెనుక కుట్ర ఉందని, అందుకు బాధ్యులైన వారందరిపై సమగ్ర విచారణ జరిపించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దర్యాప్తులో దోషులుగా తేలిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని స్పష్టం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ఈ అంశాలపై బుధవారం శాసనసభలో జరిగిన సుదీర్ఘ చర్చకు సభా నాయకుడిగా సీఎం సమాధానమిచ్చారు. స్పీకర్‌కు ప్రభుత్వం, శాసనసభ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. జరిగిన ఘటనలతో మానసిక ధైర్యం కోల్పోవద్దని స్పీకర్‌ను కోరారు. సభాపతి మనసును గాయపరిచిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.

## దళితులు నడిచిన నేలను శుద్ధి చేస్తారా?

- ఎర్రవల్లి ఘటనపై సీఎం రేవంత్ ఆగ్రహం
- డప్పులతో నిరసన తెలపడం ప్రజాస్వామ్య హక్కు
- శుద్ధీకరణ చేయడం అమానవీయమని మండిపాటు
- ఫామ్‌హౌస్ వేదికగా కుట్రలు రచించారని ఆరోపణ
- ప్రజాస్వామ్య వ్యవస్థనే అవమానించారన్న సీఎం



2



# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్!

## శాసనసభ నుంచి కేటీఆర్, హరీశ్ సహా 22 మంది సస్పెండ్

**సెషన్ మొత్తానికి సభ నుంచి వేటు**

- శ్రీధర్‌బాబు తీర్మానానికి స్పీకర్ ఆమోదం
- నినాదాలతో సభకు ఆటంకమంటూ చర్య
- స్పీకర్‌ను కలువకుండా అడ్డుకున్న మార్షల్స్

శాసనసభ వర్షాకాల సమావేశాల్లో బీఆర్ఎస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన 22 మంది ఎమ్మెల్యేలపై సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు పడింది. కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలందరినీ ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

## కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతలపై కేసు

2

- మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో నమోదు
- అసెంబ్లీ గేటు వద్ద ఘటనపై పోలీసుల చర్య
- సీసీటీవీ, వీడియోల పరిశీలనకు విజ్ఞప్తి
- సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో దర్యాప్తు





## మహిళా ఎమ్మెల్యేలను తోసింది సొంత నేతలే!

- వీడియోలు విడుదల చేసిన మంత్రి సీతక్క
- గంగుల, సుధీర్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు
- సబిత, సునీత, కోవ లక్ష్మిని నెట్టేశారని వ్యాఖ్య

## మా ఎమ్మెల్యేలపై దాడి.. మాపైనే కేసులా?

- గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు
- పోలీసుల తీరుపై ఆధారాలు ఇచ్చామన్న కేటీఆర్
- సబిత, సునీత ఘటనలను వివరించిన నేతలు
- హామీల అమల్లో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపణ
- రాష్ట్ర పరిస్థితులపై జోక్యం చేసుకోవాలని వినతి





## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

- ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..
- తెలంగాణలో అధికారంలోకి వస్తాం
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

3

## ఆయుష్ విద్యార్థులకు 'డబుల్' ధమాకా!

- హౌస్ సర్జన్లకు రూ.29,792
- పీజీలకు రూ.74,482 స్టైఫండ్
- భారీ పెంపుతో ప్రభుత్వం జీవో
- అల్లోపతి మెడికోలతో సమానంగా చెల్లింపులు
- మంత్రి దామోదర్‌కు విద్యార్థుల కృతజ్ఞతలు

రాష్ట్రంలోని ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి (ఆయుష్) విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆయుష్ మెడికోల స్టైఫండ్‌ను అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా భారీగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.




## బహిరంగ ప్రకటన

చుంచుపల్లి మండలం, చుంచుపల్లి రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 128/2ఆ లో 33 గుంటలు , 128/3/అ లో 17 గుంటల భూమికి హక్కుదారు అయిన నాకు తెలియకుండా, నా సమ్మతి లేకుండా జరిగే ఎటువంటి క్రయవిక్రయాలకు నేను బాధ్యురాలిని కాను. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోని నాకు తెలియకుండా ఎటువంటి లావాదేవీలు జరిగిన వాటిని గౌరవ కొత్తగూడెం కోర్టులోనే తేల్చుకోవాల్సి ఉంటుందని తెలియచేస్తున్నాను

ఇట్లు

బానోత్ మంగమ్మ, భర్త హరిదాస్ (లేటు), H.No 1-2-31, చుంచుపల్లితండా, చుంచుపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, 507101, తెలంగాణ.



## కరెంట్ కోతలపై రైతుల ధర్నా.. రాస్తారోకో

**కోరుట్ల రూరల్, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి)**
: ఎకిన్‌పూర్ గ్రామంలో విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులు బుధవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, 24 గంటల విద్యుత్ అందిస్తామని చెప్పిన ప్రభుత్వం కనీసం 10 గంటలు కూడా సరఫరా చేయడం లేదని ఆరోపించారు. వర్షాలు లేక ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న రైతులకు విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా యాప్ వల్ల కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కనీసం 12 గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాశిరెడ్డి మోహన్ రెడ్డి, పుట్టుకపు నర్సారెడ్డి, అరికంటి సాగర్, గంగారెడ్డి, సురేష్ రెడ్డి, జలంధర్. మల్లేషం, జగిలం లక్మినర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

## గీతంలో కాళోజీ జయంతి వేడుకలు



**పటాన్ చెరు, సెప్టెంబర్ 9, (సిరి న్యూస్):**
తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, స్వాతంత్ర్య సమరయోధుడు, ఫాసిజం వ్యతిరేక పోరాట యోధుడు, రాజకీయ కార్యకర్త శ్రీ కాళోజీ నారాయణ రావు 112వ జయంతిని హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. 'ప్రజా కవి'గా సుపరిచితులైన కాళోజీ నారాయణరావు (9 సెప్టెంబర్ 1914 -- 13 నవంబర్ 2002) జయంతిని తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ భాషా దినోత్సవం'గా ప్రకటించింది. ఈ సందర్భంగా, గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు ఆయన విగ్రహానికి పూలు సమర్పించి ఘన నివాళు లర్పించారు. ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఈ గొప్ప కవికి నివాళులర్పించారు.

## ఎండపల్లిలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం

**రోజువారీ వ్యాయామంతోనే శారీరక దారుఢ్యం: ఎంఈఓ సముద్రాల హరికృష్ణ**



**ఎండపల్లి, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి)**
: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంఈఓ, ఎస్‌జీఎఫ్ చైర్మన్ సముద్రాల హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్, స్క్రీన్ టైమ్‌కు పరిమితం కాకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రతిరోజూ కనీసం అరగంట క్రీడలకు కేటాయిస్తే శారీరక దారుఢ్యంతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. తొలిరోజు బాలికలకు అండర్--14, అండర్--17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

## వీర్లపల్లి శంకర్ పై కేసు నమోదు చేయండి

**పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన బి ఆర్ ఎస్ నాయకులు**



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 9, (తెలంగాణ వాణి):**
తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పై అనుచిత వ్యాఖ్యలు చేసి తన చావుని కోరి తెలంగాణ రాష్ట్ర పరువు మంట గలిపిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై చర్య తీసుకోవాలని, భవిష్యత్తులో ఎవరు కూడా ఇలాంటి వ్యాఖ్యలు పునరావృత్తం కాకుండా రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్లో స్థానిక ఎస్సై ప్రవీణ్ రెడ్డి కి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిర్యాదు చేశారు. మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఆధ్వర్యంలో రైతు బంధు మాజీ చైర్మన్ కలాలి సురేష్ గౌడ్, మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, మాణిక్ రెడ్డి పటేల్, భూత్కూరి సుభాష్, మాజీ వైస్ ఎంపీపీ రమేష్, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ అంజయ్య, వెంకట్ రెడ్డి పటేల్, మాజీ సర్పంచ్ లు శంకర్ గౌడ్, అశోక్ ముదిరాజ్, చంద్రకాంత్, అంబటి వెంకటేశం, నాందేడ్ శివకుమార్, సిద్దు, అశ్విన్, మంగళి యాదగిరి, జైరాజ్, ప్రణయ్, దశరథ్ తదితరులు ఈ పిర్యాదు పై సంతకాలు చేశారు.

## శాంతినగర్ పోచమ్మ తల్లి దేవాలయంలో ఘనంగా 'ఒడి బియ్యం అన్నదాన కార్యక్రమం

**పాల్గొన్న తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 9, (తెలంగాణ వాణి):**
గత నెలలో జరిగిన బోనాల ఉత్సవాలలో భాగంగా మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో శ్రీ పోచమ్మ తల్లి అమ్మ వారికి సమర్పించిన పవిత్ర ఒడి బియ్యం తో ఈరోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయ ప్రాంగణంలో భారీ ఒడి బియ్యం అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మిద్దెల సుధాకర్, చింతల్బాయి సంజీవరెడ్డి, జంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## భారత్‌కు అసాధారణ మేధో సామర్థ్యం

**ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చిన సీనియర్ సైంటిస్ట్ ప్రొఫెసర్ యజ్ఞనారాయణ**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 9, (తెలంగాణ వాణి)**
నేడు మనం వాడుతున్న మొబైల్ ఫోన్ల పరిజ్ఞానానికి నాంది పలికింది భారతీయ శాస్త్రవేత్తలేనని, మన దేశానికి అసాధారణమైన మేధో సామర్థ్యం ఉందని, దానిని విద్యార్థులు, యువ పరిశోధకులు ముందుకు తీసుకెళ్లాలని ఐఐటీ మద్రాసు పూర్వ ఆచార్యుడు, ట్రిబుల్ ఐటీ హైదరాబాదులో ఐఎన్ఎస్ఏ సీనియర్ సైంటిస్ట్ ప్రొఫెసర్ బి.యజ్ఞనారాయణ కోరారు. హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'మాట్లాడటం వంటి సహజ సంకేతాలను ప్రాసెస్ చేయడంలో సవాళ్లు' అనే అంశంపై ఆయన విశిష్ట ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని ఈఈసీఈ విభాగం నిర్వహించింది. తన విశ్లేషణాత్మక ఉపన్యాసంలో, ప్రొఫెసర్ యజ్ఞనారాయణ సిగ్నల్ ప్రాసెసింగ్, స్పీచ్ సిగ్నల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ విజన్, న్యూరల్ నెట్ వర్కులు, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసింగ్ (డీఎస్పీ)లలోని కీలక పరిణామాలు, సవాళ్ల గురించి చర్చించారు. మానవ జీవితంలో మాటల ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, మొబైల్ ఫోన్ల విస్తృత వినియోగం మాటల ద్వారా సంభాషించే సామర్థ్యంతో దగ్గరి సంబంధం కలిగి ఉందని ఆయన పేర్కొన్నారు.స్పీచ్ కంప్రెషర్, లీనియర్ ప్రిడిక్టివ్ కోడింగ్ (ఎల్పీసీ)లో బిష్టు ఎస్. అటల్, స్పీచ్ రికగ్నిషన్ లో డి.రాజ్ రెడ్డి వంటి పరిశోధకుల మార్గదర్శక కృషిని గుర్తు చేసుకుంటూ, ఈ రంగంలో భారతీయ సంతతికి చెందిన శాస్త్రవేత్తలు చేసిన గణనీయమైన కృషిని ప్రొఫెసర్ యజ్ఞనారాయణ నొక్కి చెప్పారు. దానిని కొనసాగించాలని ఆయన కోరారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎంలు), జెనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ వంటి






అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను కూడా ఆయన పరిశీలించారు. వాటి సామర్థ్యాలు ప్రాథమికంగా డేటా ప్రాతినిధ్య నాణ్యతపై ఆధారపడి ఉంటాయన్నారు. ప్రస్తుత ఏఐ వ్యవస్థలతో ముడిపడి ఉన్న పరిమితులు, సవాళ్లను ఆయన హైలైట్ చేశారు. భవిష్యత్ పరిశోధనలకు ఆశాజనకమైన రంగాలుగా స్పీచ్, సహజ భాషా ప్రాసెసింగ్ ను అన్వేషించమని విద్యార్థులను ప్రోత్సహించారు. స్పీచ్ ప్రాసెసింగ్, స్పీచ్ సిగ్నల్ ప్రాసెసింగ్ మధ్య వ్యత్యాసాన్ని వివరిస్తూ, ప్రొఫెసర్ యజ్ఞ నారాయణ మానవ స్పీచ్ ప్రాసెసింగ్ లో జ్ఞానం, సందర్భం, ఎంపిక చేసిన శ్రద్ధ ఉంటాయని, అయితే స్పీచ్ సిగ్నల్ ప్రాసెసింగ్ డీఎస్పీ టెక్నిక్ లను ఉపయోగించి మెషిన్ ఆధారిత విశ్లేషణ, ప్రాతినిధ్యంపై దృష్టి పెడుతుందని వివరించారు. సహజ సంకేతాలను అర్థం చేసుకోవడానికి వాటి డైనమిక్, పునరావృతం కాని, సంక్లిష్ట లక్షణాలపై లోతైన పరిశోధన అవసరమన్నారు.తన ఉపన్యాసాన్ని ముగిస్తూ, ఏఐ నమూనాల సంక్లిష్టతను తగ్గించడానికి సహజ సంకేతాలను సూచించే మెరుగైన మార్గాలను అభివృద్ధి చేయాలని ప్రొఫెసర్ యజ్ఞనారాయణ పరిశోధకులకు పిలుపు నిచ్చారు. సహజ సంకేతాలను ఎంత లోతుగా అన్వేషిస్తే, వాటి సంక్లి ష్టత గురించి అంతగా తెలుసు కోవచ్చని చెబుతూ, విద్యార్థులు జిజ్ఞాస, పట్టుదలతో పరిశోధనను చేపట్టాలని ఆయన ప్రోత్సహించారు. తొలుత కార్యక్రమ నిర్వాహకురాలు ప్రొఫెసర్ టి.మాధవి విశిష్ట అతిథిని పరిచేయం చేసి, స్వాగతించారు. ఈ సందర్భంగా కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రశాంత ఆర్.ఎం. అతిథిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎం.మరియదాసు దీనిని సమన్వయం చేశారు.

## జమ్మికుంట మార్కెట్ కమిటీ సమావేశంలో అభివృద్ధి పనులకు ఆమోదం



**జమ్మికుంట, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో జూన్, జూలై, ఆగస్టు నెలల ఆదాయ, వ్యయాలను సమీక్షించి పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో పత్తి, ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. 15 మంది హమాలీలకు ట్రాక్టర్, ట్రాలీ లైసెన్సులు జారీకి ఆమోదం తెలిపారు. కొత్త, పాత మార్కెట్ యార్డుల్లో తారు, కాంపౌండ్ వాల్, టాయిలెట్లు, గోడౌన్ రూఫ్‌ల మరమ్మతులు, సీసీ ప్లాట్‌ఫారమ్, డ్రైనేజీ, సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించిన పనులపై తీర్మానాలు చేశారు.

## డిజిటల్ విద్యను ప్రారంభించిన సర్పంచ్

**-- ఎక్సల్ విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత బోధన**



**డిండి, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తవక్లాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎక్సల్ విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత విద్యాబోధనను గ్రామ సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య, ఏఏపీసీ చైర్మన్ నూనె రాములమ్మ, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ కే.శ్రీను, పాఠశాల హెడ్‌మాస్టర్ డి.రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిజిటల్ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కీలకమన్నారు. సాంకేతిక విద్యతో విద్యార్థుల్లో ఆసక్తి, సృజనాత్మకత, ఆలోచనా శక్తి పెరుగుతాయని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు పట్టణ విద్యార్థులతో సమానంగా సాంకేతిక విద్య అందించడమే లక్ష్యమని సర్పంచ్ కృష్ణయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి- సబ్ కలెక్టర్




**దేవరకొండ సెప్టెంబర్ 9( తెలంగాణ వాణి ప్రతినిధి)**
దేవరకొండ డివిజన్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ తీయాన్ మావి సంబంధిత అధికారులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో పోలీస్, మున్సిపల్, విద్యుత్, వైద్య శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. మండపాల ఏర్పాటు, శోభయాత్ర రూట్ మ్యాపు, నిమజ్జనం ప్రదేశంలో విద్యుత్తు రక్షణ చర్యలపై అధికారులకు కీలక సూచనలు చేశారు.



## అసెంబ్లీ లాబీల్లో మీడియాపై ఆంక్షలు లేవు

**స్పష్టం చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**

**హైదరాబాద్, సెప్టెంబరు 8 (తెలంగాణ వాణి):**
అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధుల రాకపోకలపై ఎలాంటి ఆంక్షలు ఉండబోవని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే మీడియా లాబీల్లో కవరేజ్ చేసుకోవచ్చని తెలిపారు. మంగళవారం స్పీకర్ కార్యాలయంలో టీడబ్ల్యూజేఎఫ్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) ప్రతినిధులు ఆయనను కలిసి, ఎమ్మెల్సీల వ్యాఖ్యల నేపథ్యంలో సంఘీభావం తెలిపారు. లాబీల్లో మీడియాపై ఆంక్షలు విధిస్తున్నారనే ప్రచారంతో పాటు కవరేజ్‌లో ఎదురవుతున్న సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ప్రసాద్‌కుమార్ జర్నలిస్టులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్పీకర్‌ను కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, హెచ్‌యూజే అధ్యక్షుడు బి. అరుణ్ కుమార్, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బట్టిపాటి రాజశేఖర్, కార్యదర్శి గండ్ర నవీన్, హెచ్‌యూజే నాయకులు ప్రదీప్, తదితరులు ఉన్నారు.రూట్ మ్యాపు, నిమజ్జనం ప్రదేశంలో విద్యుత్తు రక్షణ చర్యలపై అధికారులకు కీలక సూచనలు చేశారు.

## ప్రయాణికుల సురక్షిత ప్రయాణమే డ్రైవర్ల లక్ష్యం

**అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి: ఎస్పీ అశోక్‌కుమార్**




**జగిత్యాల, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ డ్రైవర్ల ప్రధాన లక్ష్యంగా ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. జగిత్యాల ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ప్రమాదకర ఓవర్‌టేకింగ్‌కు దూరంగా ఉండాలని, మలుపులు, కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో వేగాన్ని నియంత్రించాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని, డిఫెన్సివ్ డ్రైవింగ్‌ను అలవర్చుకోవాలని అన్నారు. ప్రమాదరహితంగా విధులు నిర్వహించిన ముగ్గురు ఉత్తమ డ్రైవర్లను ఎస్పీ శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ, పోలీస్ అధికారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## కరాటే విద్యార్థులకు ఎల్లో బెల్టుల ప్రదానం



**హుజూరాబాద్, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పట్టణంలోని న్యూ కాకతీయ మోడల్ హైస్కూల్‌లో గ్లోబల్ షటోకాన్ కరాటే-డో ఇండియా అకాడమీ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు ఎల్లో బెల్టుల ప్రదానోత్సవం నిర్వహించారు. బీసీ జేఏసీ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, నాయకుడు ఉప్పు శ్రీనివాస్ విద్యార్థులకు బెల్టులు అందజేశారు. కరాటే మాస్టర్ ఎస్.కె. జలీల్ నాణ్యమైన శిక్షణ అందిస్తూ విద్యార్థులను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తున్నారని వారు అభినందించారు. కరాటేతో శారీరక దృఢత్వంతో పాటు ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. తలిదండ్రులు పిల్లలను కరాటే శిక్షణకు ప్రోత్సహించాలని కోరారు.

## ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబానికి గంగపుత్రుల భరోసా

**రూ.4 లక్షల విరాళాలతో ఆర్థిక సహాయం**



**పెద్దపల్లి, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
ముంబైలో వలస కూలీగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన పాత రామగుండం వాసి బింగి గోపాల్ కుటుంబానికి ముంబై గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం అండగా నిలిచింది. గంగపుత్రుల విరాళాలతో సమకూరిన రూ.4 లక్షల్లో రెండేళ్ల చిన్నారి భవిష్యత్తు కోసం రూ.3 లక్షలు, అనారోగ్యంతో ఉన్న తల్లి లక్ష్మి పేరుతో రూ.50 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మిగిలిన మొత్తాన్ని గోపాల్ భార్య వైద్య ఖర్చులకు అందజేశారు. పల్లికొండ రాజేష్ మాట్లాడుతూ సహకరించిన ముంబై, హైదరాబాద్, గల్ఫ్ ప్రాంతాలతో పాటు తెలంగాణలోని గంగపుత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబానికి భవిష్యత్తులోనూ అండగా ఉంటామని సంఘం ప్రతినిధులు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల గంగపుత్ర సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చాలంటూ ఆశాల నిరసన

**-- రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని డిమాండ్**



**తిమ్మాపూర్, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు తిమ్మాపూర్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు నాయిని రజిత మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, వైద్యశాఖ విధిస్తున్న కఠిన టార్గెట్లను తగ్గించాలని కోరారు. విధుల్లో మృతి చెందిన ఆశాల కుటుంబాలకు ప్రకటించిన ఆర్థిక సాయం వెంటనే అందించాలని, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు, వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, పద్మ, అనిత, మంగ, కవిత, జ్యోతి, పుష్ప, పద్మజ, స్వప్నతో పాటు పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్లంపల్లి భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

**ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్**



**పెద్దపల్లి, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
: ఎల్లంపల్లి డ్యాం నిర్మాణంతో భూములు కోల్పోయి ఏళ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్న భూ నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. బుధవారం హైదరాబాద్ అసెంబ్లీ ఆవరణలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎదులపురం వెంకటేష్ ఎమ్మెల్యేను కలిసి నిర్వాసితుల సమస్యలను వివరించారు. కొందరికి ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిహారం అందలేదని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి పెండింగ్ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక



## డ్రగ్స్‌కు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలి



**చౌటుప్పల్, సెప్టెంబర్ 9, (తెలంగాణ వాణి)**

విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ సూచించారు. డీవైఎఫ్ఐ జిల్లా మూడో మహాసభల సందర్భంగా అరవింద జూనియర్ కళాశాలలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలు లేదా వినియోగం కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మొబైల్ ఫోన్‌కు బానిస కాకుండా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధుకృష్ణ మాట్లాడుతూ స్థానిక యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించడం, కాలుష్యాన్ని అరికట్టడం మహాసభల ప్రధాన అజెండా అని తెలిపారు. మహాసభలకు జిల్లా వ్యాప్తంగా 300 మంది యువ ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఈ సెమినార్ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ దుర్గయ్య, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ ఖయ్యూం, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి పల్లె శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు తీగుళ్ల శ్రీనివాస్, నాయకులు జింకల మహేష్, అధ్యాపకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ రైల్వే అభివృద్ధికి భారీ ఊతం

**హనుమకొండ, సెప్టెంబర్ 9: సికింద్రాబాద్ (ఘట్‌కేసర్)--**



కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో రైళ్ల రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణికులు, సరుకు రవాణా సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. యాదగిరిగుట్ట, భువనగిరి తదితర పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు కనెక్టివిటీ మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన ప్రధాని మోదీ, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రైల్వే అభివృద్ధికి భవిష్యత్‌లోనూ కృషి చేస్తానని కావ్య పేర్కొన్నారు.

## సోమనాథ క్షేత్రంలో మహా మృత్యుంజయ యాగం

**చౌటుప్పల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి)**



సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ చౌటుప్పల్‌లోని తంగడపల్లి రోడ్డులో గల శ్రీ సోమనాథ క్షేత్రంలో బుధవారం మహా మృత్యుంజయ యాగం నిర్వహించారు. వేదమూర్తుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగిన యాగంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం శివలింగానికి క్షీరాభిషేకం, మహర్షికి హారతి నిర్వహించి భజనలు చేశారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ప్రతి మాస శివరాత్రి రోజున లోకకల్యాణం కోసం యాగం నిర్వహిస్తున్నామని కమిటీ అధ్యక్షుడు బడుగు నరసింహ తెలిపారు. సోమనాథ క్షేత్రం చౌటుప్పల్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అప్పిడి రామ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మండలోజు సుభాష్ చంద్ర చారి, కార్యదర్శి గట్టు ప్రభాకర్ గుప్తా, ఉప కార్యదర్శి చిరువెల్ల రవీందర్, కోశాధికారి ఊరా కృష్ణమూర్తి, మహర్షుల వారి శిష్యులు భక్తులు పాల్గొన్నారు.

## తెల్లాపూర్‌కు రూ.21 కోట్లతో రోడ్ అండర్ బ్రిడ్జి





**తెల్లాపూర్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి)**

తెల్లాపూర్, బీహెచ్ఈఎల్ ప్రాంత ప్రజల రవాణా సమస్యకు పరిష్కారంగా రూ. 21 కోట్లతో రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) మంజూరైందని మెదక్ ఎంపీ ఎం. రఘునందన్‌రావు తెలిపారు. తన చొరవతో మంజూరైన ఆర్‌యూబీ పనులు త్వరలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. బుధవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ్‌ను కలిసి ఆర్‌యూబీ మంజూరుకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తెల్లాపూర్ రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి కూడా మంజూరైందని, ఈ నెలాఖరులోగా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.పశ్చిమ హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా లింగంపల్లి వరకు నడుస్తున్న ఎంఎంటీఎస్ రైళ్లను రామచంద్రాపురం, నాగులపల్లి వరకు పొడిగించాలని రైల్వే జీఎంను కోరినట్లు ఎంపీ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు రావాల్సి ఉందని జీఎం పేర్కొన్నట్లు వెల్లడించారు. ఆర్‌యూబీ, ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరుపై స్థానికులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

## ఖరీఫ్ పంటల కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు

**నిర్మల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి)**



ఖరీఫ్ పంటల కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు, సిబ్బంది, ఇతర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. మండలాల వారీగా పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనాలను సేకరించి అవసరమైన కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గోదాములను ధాన్యం నిల్వకు సిద్ధం చేయడంతో పాటు రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఎల్‌డీఎం రామ్ గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్



## యాదయ్యచారి మృతికి నివాళులు

**నకిరేకల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి)**

చెరువు అన్నారం గ్రామానికి చెందిన ప్రింట్ మీడియా విలేకరి గడగోజు రవీంద్రచారి తండ్రి గడబోజు యాదయ్యచారి మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ యాదయ్యచారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కక్కిరేణి సైదులు, చెవుగోని సైదులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును సస్పెండ్ చేయాలి




**భూపాలపల్లి, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి)**

శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి పొన్నగంటి లావణ్య అన్నారు. బుధవారం భూపాలపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌ను వ్యక్తిగతంగా అవమానించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేసి, వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## గణేష్ మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదు చిలుకూరు ఎస్సై బండి మోహన్



**చిలుకూరు సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి )**

గణేష్ నవరాత్రులు సందర్భంగా మండలంలోని ఎక్కడైనా డీజేలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై బండి మోహన్ హెచ్చరించారు. డీజే లకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేదని తెలిపారు. అధిక డిజె సౌండ్ వల్ల ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘించకుండా ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

## క్యాతనపల్లి ప్రెస్ క్లబ్‌కు నూతన కమిటీ



**మంచిర్యాల,సెప్టెంబర్ 09 (తెలంగాణ వాణి):**

క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ (259/19)కు నూతన కార్యవర్గం ఏర్పడింది. బుధవారం జరిగిన సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా కలవల శంకర్, ప్రధాన కార్యదర్శిగా మెరుగు నారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రజలకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకురావడమే కాకుండా జర్నలిస్టుల సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని తెలిపారు. క్యాతనపల్లి, రామకృష్ణాపూర్ ప్రాంతాల ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు పాత్రికేయులు అభినందనలు తెలిపారు.

## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



**రామకృష్ణాపూర్,, సెప్టెంబర్ 09 (తెలంగాణ వాణి):**

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని క్యాతనపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి చైర్‌పర్సన్ గొడిశెల సంధ్యారాణి, కమిషనర్ ఎస్. మురళీకృష్ణతో పాటు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సమాజం, భాష, సాహిత్యం, ప్రజా సమస్యలపై కాళోజీ నారాయణరావు చేసిన విశేష కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రజల హక్కులు, సామాజిక చైతన్యం కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిల్ సభ్యులు, పురపాలక సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పురాతన గ్రంథాల పరిరక్షణకు చర్యలు



**మంచిర్యాల, సెప్టెంబర్ 09 (తెలంగాణ వాణి):**

జ్ఞాన భారతం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పురాతన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, అరుదైన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి భద్రపరచేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రంథాలయాలు, విద్యాసంస్థలు, దేవాలయాలు, మఠాలు, పరిశోధనా సంస్థలు, వ్యక్తుల వద్ద ఉన్న పురాతన పుస్తకాలు, తాళపత్ర గ్రంథాలు, చారిత్రక పత్రాలను గుర్తించాలని సూచించారు. ప్రజల వద్ద ఉన్న అరుదైన గ్రంథాలు, పాత పత్రాల సమాచారాన్ని అధికారులకు అందించేలా అవగాహన కల్పించాలన్నారు. గుర్తించిన గ్రంథాలను శాస్త్రీయ పద్ధతిలో డిజిటలైజ్ చేసి, భద్రపరచడంతో పాటు కేంద్రీకృత డిజిటల్ డేటా బేస్‌లో నమోదు చేయాలని తెలిపారు. జిల్లా చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, సంప్రదాయాలకు సంబంధించిన విలువైన వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు జ్ఞాన భారతం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పి. చంద్రయ్య సూచించారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఇందూరు అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



**నిజామాబాద్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

నిజామాబాద్ నగర, నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బుధవారం అసెంబ్లీలో సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. నగర అభివృద్ధికి రూ. 200 కోట్ల ప్రత్యేక నిధులు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఫార్మసీ కళాశాల మంజూరు చేయాలని కోరారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఔటర్ రింగ్ రోడ్డు, నగర మాస్టర్ ప్లాన్ అమలుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కళాభారతి పెండింగ్ బిల్లులు విడుదల చేయడంతో పాటు రాజారాం స్టేడియం ఆధునికీకరణ, పాత కలెక్టరేట్ మైదానంలో సింథటిక్ ట్రాక్‌తో స్టేడియం, ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు. ఇందూరు ఖిల్లా రామాలయ అభివృద్ధితో పాటు దేవాదాయ శాఖకు బదిలీ చేయాలని, జనరల్ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కోసం నిధులు విడుదల చేసి వైద్యులు, సిబ్బంది కొరత తీర్చాలని, బస్టాండ్ ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

## నూతన కోర్టు భవనానికి రూ.39.60 కోట్లు



**చౌటుప్పల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి)**

చౌటుప్పల్‌లో నూతన కోర్టు భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 39.60 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు ఇచ్చిందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరు పరమేష్ తెలిపారు. లక్కారం పరిధిలోని మోడల్ స్కూల్ ఎదురుగా సర్వే నంబర్ 50లో ఐదు ఎకరాల్లో అధునాతన సౌకర్యాలతో భవనం నిర్మించనున్నట్లు చెప్పారు. రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఇండస్ట్రియల్ కోర్టు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**తెల్లాపూర్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి)**

తెల్లాపూర్ 263వ డివిజన్ పరిధిలోని నాగులాపల్లి గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని కట్ట మైసమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. గ్రామంలోని దేవాలయాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు, రమేష్, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడి లో జాతీయ పోషణ మాసం బి పోషక ఆహార వారోత్సవాలు



**చౌటుప్పల్, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**

చౌటుప్పల్ మండలం అంకిరెడ్డి గూడెం గ్రామం లోని అంగన్వాడి సెంటర్ లో బుధవారం జాతీయ పోషణ మాసం బి పోషక ఆహార వారోత్సవాలు కార్యక్రమం అంగన్వాడీ టీచర్లు నల్ల జయప్రద, చప్పిడి కల్పన ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వల్లందాస్ మహేష్ గౌడ్ హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం( ఐ సి డి ఎస్ ), రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతల ఆరోగ్యం, పోషణ మరియు విద్యాభివృద్ధి గురించి ప్రవేశపెట్టిన పథకం అని ఈ పథకం ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బత్తుల అనూష, దొడ్ల అండాలు, ఆశా వర్కర్ బొల్లు అండాలు , మహిళా సంఘ బంధం అధ్యక్షురాలు పెండెం లక్ష్మి, కోశాధికారి భీమగోని శోభ, చిన్నపిల్లల తల్లులు పాల్గొన్నారు.

## కాళోజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం





**వనపర్తి: సెప్టెంబర్ 9, (తెలంగాణ వాణి ప్రతినిధి))**

తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహం (బి)లో వేడుకలు నిర్వహించారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి వసతిగృహ సంక్షేమ అధికారి పసుల సత్యనారాయణ యాదవ్, సిబ్బంది, విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ భాష, యాస, ప్రాసతో పాటు ఇక్కడి సాంస్కృతిక జీవన విధానం ఎంతో గొప్పదని కొనియాడారు. తెలంగాణ భాషలోని మాధుర్యం, యాస 10 లోని ఆత్మీయత, ప్రజల జీవన విధానంలో ప్రతిబింబించే సంస్కృతి, సంప్రదాయాలు ప్రత్యేకమైన వని అన్నారు. మన భాషను, యాసను, సంస్కృతిని గౌరవించడంతో పాటు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.కాళోజీ నారాయణరావు దేశ స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్రను విద్యార్థులకు వివరించారు. ప్రజల సమస్యలను తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన కాళోజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమన్నారు. కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకొని విద్యలో రాణించాలి అన్నారు.

## పండుగను సామరస్యంతో జరుపుకోవాలి

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, సెప్టెంబర్ 09 (తెలంగాణ వాణి):**
వినాయక చవితి వేడుకలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ మండపాల వద్ద విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని డీసీపీ ఎ. భాస్కర్ కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి):**
ఏరియా ఆసుపత్రిలో డీవైసీఎంఓ (అడ్మిన్) డా. ఎం. మధుకుమార్ ఆధ్వర్యంలో పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన జీవనశైలి ఆరోగ్యానికి ఎంతో అవసరమని ఆయన తెలిపారు. మధుమేహులు చక్కెరలు, అధిక కార్బోహైడ్రేట్లను నియంత్రించాలని, కిడ్నీ వ్యాధిగ్రస్తులు వైద్యులు, డైటీషియన్ల సూచనల మేరకు ఆహారం తీసుకోవాలని సూచించారు. జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండి నిత్యం వ్యాయామం చేయాలని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ పీఓ మదార్ సాహెబ్, మాట్రాన్ టి.వి. విజయలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పారామెడికల్ సిబ్బంది, యూనియన్ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## డిమాండ్ల సాధనకు ఉద్యోగుల ఐక్య ఉద్యమం



**మంచిర్యాల, సెప్టెంబర్ 09 (తెలంగాణ వాణి):**
టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న చలో హైదరాబాద్ మహాధర్నాకు మంచిర్యాల ఆర్డీవో కార్యాలయ సిబ్బంది మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు సిబ్బంది మూకుమ్మడిగా సామూహిక సెలవులు పెట్టారు. జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న మహాధర్నాకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని శ్రీహరి, సెక్రెటరీ జనరల్ వనజారెడ్డి పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని ఆర్డీవో జి. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు జేఏసీ నాయకులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ గర్వించదగ్గ మహనీయుడు కాళోజీ



**మంచిర్యాల, సెప్టెంబర్ 09 (తెలంగాణ వాణి):**
తెలంగాణ వైతాళికుడు, ప్రముఖ కవి, రచయిత కాళోజి నారాయణరావు తెలంగాణ ప్రజల ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో నిర్వహించిన కాళోజీ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములుతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాళోజీ తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని, తెలంగాణ భాష, సంస్కృతి, సామాజిక సమానత్వం కోసం కృషి చేశారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఫ్‌పీవోలో 440 మంది సభ్యుల ఎంపిక



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో)లో తొలి విడతగా రూ. 2,000 సభ్యత్వం పొందిన రైతులకు షేర్ సర్టిఫికెట్లను అందజేశారు. మొత్తం 750 మంది రైతులను సభ్యులుగా చేర్చే లక్ష్యానికి ఇప్పటివరకు 440 మంది చేరినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీ సభ్యులు, డైరెక్టర్లు, సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

**- జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**

**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి విలేఖరి):**
నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో కేసుల పురోగతి, శాంతిభద్రతలు, పోలీస్‌స్టేషన్ల పనితీరును సమీక్షించారు. సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. దొంగతనాల నివారణకు రాత్రి గస్తీ, సీసీ కెమెరాలు, సాంకేతిక నిఘాను పటిష్టం చేయాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, నకిలీ నంబర్ ప్లేట్లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు భద్రతా ప్రణాళిక సిద్ధం చేయాలని, మండపాల నిర్వాహకులు వివరాలను ఆన్‌లైన్‌లో



నమోదు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అత్యవసరంగా 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించేలా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐ పి ఎస్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఏఓ యూనస్ అలీ, ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, కృష్ణ, రవీందర్ నాయక్, సమ్మయ్య, సాయి కుమార్, దీపక్, ఆర్ ఐ అడ్మిన్ రామ్ నిరంజన్, శేఖర్, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు

**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమార ప్రసాద్ అలియాస్ నాగులపురం వరప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడంతో పాటు సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే అంబేడ్కర్‌పై ఆయన రాసిన పుస్తక ప్రచురణ, ఆవిష్కరణను నిలిపివేసి రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ అట్కరి బబ్లు, డివిజన్ అధ్యక్షుడు మల్లు సాయిబాబా, ఉపాధ్యక్షుడు డాక్టర్




సాయిలు, కోశాధికారి రోడ్డ సాయిబాబా, మండల అధ్యక్షుడు అమృతరావు, ప్రధాన కార్యదర్శి కుసులకంటి సాయిలు, బి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజాకవి కాళోజి జయంతి వేడుకలు

**మందమర్రి సెప్టెంబర్ 09 (తెలంగాణ వాణి)**
ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని బుధవారం సింగరేణి ఆధ్వర్యం లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, కాలోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.?ఈ సందర్భంగా జి ఎం మాట్లాడుతు కాళోజీ నారాయణరావు తన కలం, గళంతో తెలంగాణ ప్రజా చైతన్యానికి, భాషా వికాసానికి దిశానిర్దేశం చేశారని కొనియాడారు. అదేవిధంగా కాళోజి జయంతి సందర్భంగా మందమర్రి



మున్సిపల్ కార్యలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ రాయలింగు కాళోజి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. సమాజానికి కాళోజి చేసిన సేవలను కొనియాడారు.

## కలెక్టరేట్‌లో ప్రజాకవి కాళోజీ జయంతి వేడుకలు



**నిజామాబాద్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ భుజంగరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కాళోజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కాళోజీ సాహిత్యం, రచనలు ప్రజల్లో చైతన్యాన్ని నింపాయని అన్నారు. కాళోజీ ఆలోచనా విధానాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సామాజిక సమస్యలపై ఆయన నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా స్పందించేవారని, విద్యార్థి దశ నుంచే నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో గీత, డీఎంహెచ్‌వో డాక్టర్‌రాజశ్రీ, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు

## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**నిరుద్యోగ యువతకు కలెక్టర్ భవేష్ మిశ్రా పిలుపు**

**నిజామాబాద్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పోలీస్ శాఖలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో నిరుద్యోగ యువత ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచిం చారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 200 మంది ఉద్యోగార్థులకు రెండు నెలల పాటు ఉచితంగా థియరీ, దేహదారుఢ్య పరీక్షల శిక్షణ అందిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న శిక్షణ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్యతో కలిసి కలెక్టర్ బుధవారం సందర్శించారు. అభ్యర్థులకు పలు సూచనలు చేస్తూ రీజనింగ్, ఇంగ్లిష్, గణితంలో మెరుగైన మార్కులు సాధించేందుకు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ తీవ్రంగా ఉన్నందున ఏకాగ్రత, పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. రెండు నెలల పాటు సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి శిక్షణపై పూర్తి దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ హైదరాబాద్ స్థాయి కోచింగ్‌కు దీటుగా నిపుణులైన ఫ్యాకల్టీ, నాణ్యమైన మెటీరియల్‌తో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై నిరంతర సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, భాగ్యకిరణ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ భాగ్యకిరణ్, ఏసీపీ ప్రకాష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## గాంధీగంజ్ మార్కెట్ సమస్యలు పరిష్కరిస్తాం

**మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి**



**నిజామాబాద్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: గాంధీగంజ్ మార్కెట్‌లో రైతులు, రిటైల్ వర్తకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నూతన రిటైల్ కూరగాయల మడిగెలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ తొలివిడతగా 40 మంది అర్హులకు మడిగెలు కేటాయించామని, మిగతా అర్హులకు కూడా త్వరలో అందేలా చూస్తా మన్నారు. మార్కెట్‌లో ట్రాఫిక్, తాగునీరు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య మాటా ్లడుతూ మార్కెట్‌ను ఆధునీకరించి రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వ్యాపారుల సంఘం ప్రతినిధులు, రైతులు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగలకు పటిష్ట పోలీస్ బందోబస్తు

**-- పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య**



**నిజామాబాద్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాబోయే పండుగల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో నిజామాబాద్ డివిజన్ పరిధిలోని పెండింగ్ కేసులపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దాడులు నిర్వహించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బాధితులకు తక్షణ సహాయం అందించాలన్నారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లపై నిఘా, రాత్రి గస్తీని పటిష్టం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్లను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్ల వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ప్రజలకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. పండుగల సందర్భంగా 24 గంటలూ వాహనాల తనిఖీలు చేపట్టి శాంతి భద్రతలను కాపాడాలని కమిషనర్ స్పష్టం చేశారు. సమీక్ష సమావేశంలో నిజామాబాద్ ఏ.సి.పి ప్రకాష్ యాదవ్ , సి.సి.ఆర్.బి ఎ.సి.పి గురునాయుడు , సి.సి.ఆర్బి ఇన్స్పెక్టర్ ఆర్. అంజయ్య , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , సీ.ఐ లు మరియు ఎస్హెచ్ఓలు మరియు ఎస్సై , ఐటి కోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్న తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి. శ్రీనివాసరావును బుధవారం కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. శాలువా, పూలమాలతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. కళాశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం సమిష్టి కృషి ఫలితమని తెలిపారు. కారక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే. రవీందర్ మృతి

**మందమర్రి సెప్టెంబర్ 09 (తెలంగాణ వాణి)**



తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులు మందమర్రి భారత రాష్ట్ర సమితి మందమర్రి పట్టణ అధ్యక్షుడు జంగిలి రవీందర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు హైదరాబాద్‌లోని రెనో చెంచారీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. రవీందర్ మృతితో బి ఆర్ ఎస్ శ్రేణుల్లో ,మందమర్రి పట్టణంలో విషాదం నెలకొంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం లో తన వంతుపాత్ర పోషించి బి ఆర్ ఎస్ పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేసిన రవీందర్ మృతి పార్టీ కి తీరని లోటని ఆయన సన్నిహితులు పార్టీ అభిమానులు పేర్కొన్నారు.

## మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

### రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



**మందమర్రి, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి):**
నేరాల నియంత్రణ, మహిళల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం మందమర్రి సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని, సీజ్ చేసిన వాహనాలను క్రమబద్ధంగా ఉంచాలని సూచించారు. కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించి పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి చట్టపరిధిలో సహకారం అందించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. మత్తు పదార్థాల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఆదిలాబాద్ రైతన్నల ఎడ్ల పండుగ

### సెప్టెంబర్ 11న 'పొలాల పండుగ'



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వ్యవసాయంతో ముడిపడిన సంప్రదాయాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇందులో భాగంగా రైతులు తరతరాలుగా నిర్వహిస్తున్న 'పొలాల పండుగ' లేదా 'ఎడ్ల పండుగ'ను ఈ నెల 11న శ్రావణ బహుళ అమావాస్య సందర్భంగా జరుపుకోనున్నారు. పంట పొలాలను దున్నడంలో కీలకపాత్ర పోషించే ఎద్దులను రైతులు పూజించి, వాటికి ప్రత్యేక అలంకరణలు చేస్తారు. మైదాన ప్రాంతాలతో పాటు గిరిజన ప్రాంతాల్లోనూ ఈ పండుగను స్థానిక ఆచారాలు, సంప్రదాయాలకు అనుగుణంగా ఘనంగా నిర్వహిస్తారు. రైతు జీవన విధానంలో పశువుల ప్రాధాన్యతను చాటిచెప్పే ఈ పండుగకు ప్రత్యేక విశిష్టత ఉంది.

## పత్తి పంట మధ్యలో గంజాయి సాగు.. నిందితుడు అరెస్ట్

### 125 గంజాయి మొక్కలు స్వాధీనం.. విలువ రూ.12.50 లక్షలు

**ఇచ్చోడ, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



పత్తి పంట మధ్యలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని నేరడిగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. నేరడిగొండ మండలం బోరిగాం గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో మంగళవారం తనిఖీలు నిర్వహించగా 125 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని బోరిగాం గ్రామానికి చెందిన ఆడే కపిల్ (33)గా గుర్తించారు. 3.7 ఎకరాల్లో పత్తి పంట మధ్యలో అంతర పంటగా గంజాయిని రహస్యంగా సాగు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారు రూ. 12.50 లక్షలు ఉంటుందని ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్ రమేష్ తెలిపారు. నిందితుడి ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ప్రజలు మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై ఇమ్రాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ పకడ్బందీగా పూర్తి చేయాలి

### -- రాష్ట్ర సీఈఓ సుదర్శన్‌రెడ్డి



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 09 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడడంతో పాటు, మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను నిబంధనల మేరకు తొలగించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి తాంసీ, భీంపూర్ మండలాల్లోని ఘోట్కూరి, పిప్పల్‌కోటి పోలింగ్ కేంద్రాలను సీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, దరఖాస్తుల పరిశీలన, ఓటర్ల వివరాల ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో మిగలకుండా, అనర్హుల పేర్లు కొనసాగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల, సంజయ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను కూడా సీఈఓ, కలెక్టర్ పరిశీలించారు.

## ఉద్యోగులు, పెన్షనర్లకు క్యాష్‌లెస్ వైద్యం

**భైంసా, సెప్టెంబర్ 09 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు భైంసాలోని కృష్ణ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో ఈహెచ్ఎస్ ద్వారా నగదు రహిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. నర్సింహానగర్‌లోని జీడీఆర్ కాంప్లెక్స్‌లో ఉన్న ఆసుపత్రిలో పాలీట్రామా, ఆర్థోపెడిక్స్, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, న్యూరాలజీ, పీడియాట్రిక్స్, న్యూరోసర్జరీ, జనరల్ సర్జరీ తదితర విభాగాల్లో సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈహెచ్ఎస్ లబ్ధిదారులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యానికి చెక్

**-- 10 రోజుల్లో మార్పు లేకుంటే చర్యలు: కలెక్టర్ రాహుల్ శర్మ**

**భూపాలపల్లి, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు మౌలిక వసతులను మెరుగుపరచాలని కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యులను ఆదేశించారు. బుధవారం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన క్యాజువాలిటీ, ల్యాబ్, ఓపీ, క్రిటికల్ కేర్, డయాలసిస్ తదితర విభాగాలను పరిశీలించారు. 140 పడకల ఆసుపత్రిని 230 పడకలకు పెంచేందుకు అవసరమైన భవనాలు, పరికరాలు, సిబ్బందిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, అంబులెన్స్‌లు తదితర సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, 10 రోజుల్లో పరిస్థితి మెరుగుపడకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి నిర్వహణపై వైద్యులతో సమీక్ష నిర్వహించి, సమన్వయంతో పనిచేసి



రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వసంతకుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రత్నం, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ఎన్‌పీడీసీఎల్ డీఈ పాపిరెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ దివ్య, అసిస్టెంట్ డైరెక్టర్ యాదగిరి, ఆర్ఎంఓ డాక్టర్ రాజేష్, టీజీఎంఐడీసీ అధికారులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## బీసీ హాస్టల్ వార్డెన్‌పై సస్పెన్షన్

### -- సమగ్ర విచారణ జరపాలి: శివనాయక్

**వనపర్తి, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**




జిల్లా ప్రభుత్వ బీసీ కాలేజ్ బాలుర హాస్టల్ వార్డెన్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్. నరేందర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఈ నెల 8న ఉత్తర్వులు జారీ చేయడం స్వాగతించదగ్గ పరిణామమని బంజారా విద్యార్థి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివనాయక్ అన్నారు. విద్యార్థుల ఆహారం, బియ్యం, మెస్ నిర్వహణ, హాజరు, నిధులు తదితర అంశాల్లో అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సస్పెన్షన్‌తో సరిపెట్టకుండా స్టాక్ రిజిస్టర్లు, బియ్యం సరఫరా వివరాలు, మెస్ బిల్లులు, హాజరు రికార్డులు, ఆడిట్ నివేదికలను సమగ్రంగా పరిశీలించి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అక్రమాలు రుజువైతే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలతో పాటు ప్రభుత్వ నిధులను రికవరీ చేయాలని కోరారు. విచారణను పారదర్శకంగా నిర్వహించి, తదుపరి క్రమశిక్షణా చర్యలను వేగవంతం చేయాలని శివనాయక్ అన్నారు.

## మహిళల స్వావలంబనకు కుట్టుమిషన్ శిక్షణ

### కొయ్యలగూడెంలో ఆసరా ఫౌండేషన్ కేంద్రం ప్రారంభం




**చౌటుప్పల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
: మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొయ్యలగూడెం గ్రామంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామీణ మహిళలకు ఉచితంగా కుట్టుపని శిక్షణ అందించి స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొల్లా శివశంకర్ మాట్లాడుతూ.. మహిళలకు ఆర్థిక సహాయంతో పాటు శాశ్వత ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమన్నారు. కుట్టుమిషన్ శిక్షణతో ఇంటి నుంచే ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సెక్రటరీ బొల్ల కవిత శివశంకర్, చిప్ప ప్రభాకర్, వనం దుష్యంతల, చిలువేరు పురుషోత్తంరావు, సునీత, డాక్టర్ సమత, సర్పంచ్ కైరం కొండ స్వప్న అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## డీజే సౌండ్ సిస్టమ్‌లను జప్తు చేయాలి

### -- టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా

**వనపర్తి, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



ఉత్సవాలు, ఊరేగింపుల పేరుతో మితిమీరిన శబ్దంతో డీజేలు నిర్వహించడంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని టీజేఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా డిమాండ్ చేశారు. అధిక శబ్దాల వల్ల వృద్ధులు, చిన్నారులు, గుండె రోగులు, ఆసుపత్రుల్లోని రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. శబ్ద కాలుష్య నిబంధనలు ఉల్లంఘించే నిర్వాహకులపై కేసులు నమోదు చేసి, సౌండ్ సిస్టమ్‌లను వెంటనే జప్తు చేయాలని కోరారు. సాంప్రదాయ వాయిద్యాలకు, నిబంధనల పరిధిలోని మైక్‌లకు మాత్రమే అనుమతి ఇవ్వాలని సూచించారు. అధికారులు స్పందించకపోతే ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## యాదయ్యచారి మృతికి నివాళి



**నకిరేకల్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి):**
చెరువు అన్నారం గ్రామానికి చెందిన ప్రింట్ మీడియా విలేకరి గడగోజు రవీంద్రచారి తండ్రి గడగోజు యాదయ్యచారి మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కక్కిరేణి సైదులు, చెవుగోని సైదులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



## మురికి కాలువలోకి దిగి చెత్త తొలగింపు

### అధికారుల తీరుపై కౌన్సిలర్ భర్త ఆగ్రహం

**వనపర్తి, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి మున్సిపాలిటీ 22వ వార్డులో మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తను బీఆర్ఎస్ కౌన్సిలర్ ఏర్వ అరుణ భర్త మెకానిక్ శ్రీను స్వయంగా కాలువలోకి దిగి తొలగించారు. కాలువలో చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదని శ్రీను ఆరోపించారు. అధికారుల కోసం ఎదురుచూడకుండా ప్రజల సమస్యను తానే పరిష్కరించేందుకు చెత్త తొలగించినట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, వార్డులో పారిశుద్ధ్య సమస్యలపై ఇకనైనా అధికారులు స్పందించాలని కోరారు.

## మట్టి గణపతిని పూజిద్దాం

### పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గణేష్ నవరాత్రి ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన 'మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, హుజూరాబాద్ ఆర్డీఓ జలకుమారి, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ చౌరస్తా దగ్గర రైతుల ధర్నా



**రాజపేట సెప్టెంబర్: 09(తెలంగాణ వాణి విలేకరి)**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో నీ గాంధీ చౌరస్తా దగ్గర రైతులు ధర్నా నిర్వహించారు. వ్యవసాయానికి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని పంటలు ఎండిపోకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## దళితులను అవమానించే చర్యలను సహించం

### డీసీసీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కనకం విద్యాసాగర్

**కరీంనగర్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



: దళితుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించడం, అంటరానితనాన్ని ప్రోత్సహించే చర్యలను సహించబోమని డీసీసీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కనకం విద్యాసాగర్ అన్నారు. ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితుల రాకతో అపవిత్రమైందంటూ శుద్ధి కార్యక్రమం నిర్వహించినట్లు వచ్చిన వార్తలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది దళితులను అవమానించడమేనని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత సంఘాలు, ప్రజా సంఘాలు పార్టీలకు అతీతంగా ఐక్యంగా స్పందించాలని కోరారు.



## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 09 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను పెన్‌గంగా భవన్‌లోని అదనపు కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, అధికారులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిత్రు మాట్లాడుతూ.. తెలంగాణ యాసలో కవితలు రచించి ప్రజలను చైతన్యపరిచిన కాళోజీ సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన జన్మదినాన్ని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మహనీయుల జయంతి వేడుకల ద్వారా వారి సేవలను భావితరాలకు తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ స్రవంతి, ఏఓ ఎస్తేర్ వర్ణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయండి



**మందమర్రి సెప్టెంబర్ 09 (తెలంగాణ వాణి)**
జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 10 న మంచిర్యాల లోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో పెద్దపల్లి,ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజక వర్గాల పరిధిలో జరుగనున్న సమావేశా నికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జనసేన పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సమావేశం లో బుధవారం పార్టీ సీనియర్ నాయకులు ఆవుల సాగర్ ఆధ్వర్యం లో ఛలో మంచిర్యాల పోస్టర్ లను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి, ఆదిలాబాద్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ మంతెన సంపత్ కుమార్,చెన్నూర్ నియోజకవర్గ నాయకులు జీవన్ వడ్లకొండ,రాష్ట్ర అధికార ప్రతినిధి మూల హరీష్ గౌడ్ తో పాటు, చెన్నూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు పిట్టల సుధాకర్,రసమల్ల రాజేష్,వాసాల అజయ్,చరణ్ ,పవన్ పాల్గొన్నారు.

## బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరిక



**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి):**
లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన బీజేపీ మండల నాయకుడు సంగ లచ్చన్న బీఆర్ఎస్‌లో చేరారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సమక్షంలో ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, ఉపాధ్యక్షుడు అంకతి రమేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇండ్ల లింగన్న ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లచ్చన్న మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడంతో పాటు మంచిర్యాల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

## ఘనంగా కాళోజీ 112వ జయంతి



**వనపర్తి, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. ఈశ్వరయ్య మాట్లాడుతూ.. తెలంగాణ యాస, భాష పరిరక్షణకు కాళోజీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ ఉద్యమాలతో పాటు పలు ప్రజా ఉద్యమాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. 'నా గొడవ' కవితా సంపుటి ద్వారా తెలంగాణ యాస, భాషకు విశిష్ట గుర్తింపు తీసుకొచ్చారని, ఆయన సేవలకు కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్‌తో సత్కరించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రామరాజు యాదవ్ , అధ్యాపకులైన డాక్టర్ శ్రీనివాస్ పోతరాజు,, జోగు సంజీవయ్య, దౌలమ్మ, మంజుల, రూప, స్రవంతి, మణిదీప, విజయలక్ష్మి, కాజన్న, మహబూబ్ పాషా, రాహుల్, విద్యార్థులు అందరూ పాల్గొన్నారు.

## ఎంపీ రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు

**తెల్లాపూర్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి):**



తెల్లాపూర్-- బీహెచ్ఈఎల్ ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్ అయిన రూ. 21 కోట్ల రోడ్ అండర్ బ్రిడ్జి మంజూరుకు కృషి చేసిన మెదక్ ఎంపీ ఎం. రఘున దన్‌రావుకు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెల్లాపూర్ రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయించడం అభినందనీయమని, ప్రజల రవాణా సమస్యల పరిష్కా రానికి ఎంపీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.

## ప్రజల గొంతుకగా నిలిచిన కాళోజి



**హుస్నాబాద్, సెప్టెంబర్ 9 (తెలంగాణ వాణి ఆర్‌సి)**
: తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను హుస్నాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కాళోజి చిత్రపటానికి చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని కాళోజి తన రచనల ద్వారా ప్రపంచానికి చాటారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, హక్కులపై తన కలంతో పోరాడిన కాళోజి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ భాష, సంస్కృతిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వి. వెంకటరమణ, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎండి. హసన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు




**తిమ్మాపూర్, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తిమ్మాపూర్‌లోని ఎంజేపీటీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సరిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రముఖ కవి, రచయిత డాక్టర్ బుర్రా మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ యాస, భాష పట్ల ప్రతి ఒక్కరూ గర్వపడాలని, పేదరికాన్ని అధిగమించి ఉన్నత స్థాయికి చేరుకోవడానికి విద్యే బలమైన ఆయుధమని అన్నారు. విద్యార్థులు ఆత్మన్యూనతను వీడి కష్టపడి లక్ష్యాలను సాధించాలని సూచించారు. తాను రచించిన పుస్తకాలను కళాశాల గ్రంథాలయానికి అందజేశారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సరితను అభినందించారు. కార్యక్రమంలో లయన్ ముర్రిపెద్ది మహేందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదు

**-- సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకరయ్యపై కేసు నమోదు చేయాలని**

**కోరుకంటి చందర్ డిమాండ్**



**పెద్దపల్లి, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే కె. శంకరయ్యలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి రామగుండం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం చందర్ మాట్లాడుతూ రాజకీయ విమర్శలు సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలు, మరణాన్ని కోరుకునేలా వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదన్నారు. కేసీఆర్‌పై చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలు ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉన్నందున పోలీసులు విచారణ జరిపి బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



**కంగ్టి, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ముర్కుంజాల్ సర్పంచ్ సారంగి అనూష లాల్‌కుమార్ కోరారు. బుధవారం ముర్కుంజాల్ ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యార్థుల హాజరు, బోధన, పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, నిల్వలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలలోని సమస్యలను డీఈఓ, ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినా స్పందన ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

## హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలపాలి

**-- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం**



**హుస్నాబాద్, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి ఆర్‌సి):**
కొత్త జిల్లాల ఏర్పాటు జరిగి పదేళ్లు గడుస్తున్నా హుస్నాబాద్ ప్రాంత ప్రజల పరిపాలనా కష్టాలు తీరలేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం అన్నారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల ప్రజలు పలు ప్రభుత్వ పనుల కోసం దూరంలోని సంగారెడ్డికి వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో సమయం, డబ్బు వృథా అవుతున్నాయని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హుస్నాబాద్ ప్రాంతాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు. అది సాధ్యం కాకపోతే హుస్నాబాద్‌లో జిల్లా స్థాయి కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# డీఏఈఎస్ఐ డీలర్లకు క్షేత్రస్థాయి శిక్షణ



**రాయికోడ్, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డీఏఈఎస్ఐ శిక్షణ పొందుతున్న వ్యవసాయ ఇన్‌పుట్ డీలర్లకు రాయికోడ్ మండలం సింగితం గ్రామంలో క్షేత్రస్థాయి శిక్షణ నిర్వహించారు. పట్లొల్ల ప్రకాష్‌రెడ్డి క్షేత్రంలో బొప్పాయి, హెచ్‌డీపీఎస్ పత్తి, చెరకు, కంది పంటలను పరిశీలించి, పంటల సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటల్లో కనిపిస్తున్న పురుగు, తెగుళ్లను గుర్తించి సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. పురుగుల ఉధృతి ఆర్థిక నష్ట పరిమితిని దాటినప్పుడే సిఫారసు చేసిన మందులను సరైన మోతాదులో వినియోగించాలని తెలిపారు. పురుగుమందుల మిశ్రమాలు, పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలను వివరించారు. శిక్షణతో డీలర్లు రైతులకు శాస్త్రీయ వ్యవసాయంపై మెరుగైన సలహాలు అందించగలరని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీడీఏ గులాం మహబూబ్, ఏవో సారిక, షుగర్ ఫ్యాక్టరీ జీఎం రవీందర్‌రెడ్డి, ఏఈవో అర్చన, ఏటీఎం రమేష్, సర్పంచ్ శ్రావణి నిరంజన్, డీఏఈఎస్ఐ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# 22, 23 తేదీల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**పటాన్‌చెరు, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి):**
పటాన్‌చెరు కేంద్రంగా ఈ నెల 22, 23 తేదీల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లతో ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. గత 25 ఏళ్లుగా నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. 22న ప్రభుత్వ ఉపాధ్యాయులకు, 23న ప్రైవేటు ఉపాధ్యాయులకు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఈఓ లు నాగేశ్వర రావు నాయక్,




సుధాకర్, విజయ్ కుమార్, పౌలిన, భాస్కర్, రామచంద్రపురం జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ రాథోడ్, ప్రైవేట్ పాఠశాల ప్రతినిధులు తేజ, ప్రభాకర్ రెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

**సంగారెడ్డి, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో కాళోజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ఆత్మగౌరవానికి కాళోజీ చేసిన సేవలు చిరస్మరణీయమని వారు కొనియాడారు. ఆయన ప్రజా చైతన్య స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనకు తొలి అడుగు




**తిమ్మాపూర్, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: మండలంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరై వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకుంటే ప్రాంగణ నియామకాల్లో మెరుగైన అవకాశాలు పొందవచ్చని ఆయన సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు నాణ్యమైన విద్యతో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. జేఎన్‌టీయూ నిబంధనలు, సిలబస్, పరీక్షా విధానంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

**డిండి ఎస్సై సీహెచ్. బాలకృష్ణ**





**డిండి, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి):**
గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని డిండి ఎస్సై సీహెచ్. బాలకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గణేష్ ఉత్సవాల నిర్వాహకులు, గ్రామ పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. గణేష్ మండపాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలిగించేలా డీజేలు ఏర్పాటు చేయరాదని, నిమజ్జనం సందర్భంగా తగిన భద్రతా చర్యలు పాటించాలని కోరారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని తెలిపారు.

## త్రికుటేశ్వరాలయంలో ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠ

**సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు**



**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి)**
మండలంలోని తోటపల్లి త్రికుటేశ్వరాలయంలో బుధవారం నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన, శివలింగానికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. సర్పంచ్ బంక లక్ష్మీచందు ఆధ్వర్యంలో వేదోక్తంగా పూజలు చేపట్టారు. గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

## 2.8 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

**-- రూ.1.50 లక్షల విలువైన గంజాయి పట్టివేత**

**పటాన్‌చెరు, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి):**
ఇస్నాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారి–65పై మంగళవారం సాయంత్రం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 2.8 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బుల్లెట్ వాహనంపై గంజాయి తరలిస్తున్న కురుపూడి గణపతి (33), చిన్న సాయబు మల్లేశం (32)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 1.50 క్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి బుల్లెట్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, ఎన్‌డీపీఎస్ చట్టం–1985 కింద కేసు నమోదు చేశారు. అనంతరం ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



**హుస్నాబాద్, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి ఆర్.సి):**
ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్, ఎన్‌ఎస్‌ఎస్ చైర్మన్ వి.లలిత కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాళోజీ రచనలు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లలిత సూచించారు. తెలుగు అధ్యాపకుడు డి.రవీందర్‌ను సన్మానించారు. విద్యార్థులు సాహిత్యం, పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచుకోవాలని రవీందర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డి.కరుణాకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం ఎస్.సదానందం, బి.లక్ష్మయ్య, ఏ.సంపత్, ఎస్.కవిత, కే స్వరూప, జీ.కవిత, ఆస్మా ఫిర్దోస్, కుమారి ఓ.రాణి, అధ్యాపకేతర బృందం జూనియర్ అసిస్టెంట్‌ఎస్ రాములు, రికార్డ్ అసిస్టెంట్ టి రమాదేవి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థినిలు తదితరులు వారు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాల తయారీలో విద్యుత్ భద్రత తప్పనిసరి

**విద్యుత్ శాఖ డైరెక్టర్ ఆపరేషన్ మధుసూదన్**



**కోరుట్ల రూరల్, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి):**
వినాయక విగ్రహాల తయారీదారులు విద్యుత్ భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విద్యుత్ శాఖ డైరెక్టర్ ఆపరేషన్ మధుసూదన్ సూచించారు. బుధవారం కోరుట్ల పట్టణంలోని విగ్రహ తయారీదారులతో ఆయన మాట్లాడారు. విగ్రహాలను తరలించే సమయంలో విద్యుత్ లైన్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే స్థానిక విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు విగ్రహాల ఎత్తును పరిమితంగా ఉంచాలని కోరారు. అవసరమైన సహాయం కోసం 1912కు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు బి. అశోక్, రఘుపతి, శ్యామ్, సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ఐదుగురికి మూడేళ్ల జైలు

**ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా**



**పెద్దపల్లి, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
: గంజాయి కొనుగోలు, విక్రయానికి సంబంధించిన 2020 కేసులో ఐదుగురు నిందితులకు పెద్దపల్లి జిల్లా కోర్టు న్యాయమూర్తి కె. సునీత మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేల జరిమానా విధించారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 7.820 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం దాఖలు చేసిన అభియోగపత్రం ఆధారంగా నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష విధించింది. గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు.

## స్పందనను పరామర్శించిన పెరుక సంఘం నాయకులు



**పెద్దపల్లి, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లి చికిత్స అనంతరం కోలుకున్న మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన లగిశెట్టి స్పందనను పెరుక సంఘం నాయకులు పరామర్శించారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి, జిల్లా అధ్యక్షుడు దుండె మల్లేశం, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు పోతరాజుల అంజయ్య ఆధ్వర్యంలో గతంలో స్పందన కుటుంబానికి రూ.1,51,200 ఆర్థిక సాయం అందించారు. తాజాగా ఇంటికి చేరుకున్న స్పందనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మీస రఘు, లెగిశెట్టి చంద్రమౌళి, కందుల సత్యనారాయణ, మీస వికాస్, తిప్పని రాయలింగు, కందుల శంకరయ్య, కందుల పోచం తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతుల ఇబ్బందులు

**బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వనం నరేందర్‌రెడ్డి**

**దేవరకొండ, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



దేవరకొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు వనం నరేందర్‌రెడ్డి తెలిపారు. తక్కువ వోల్టేజీ, తరచూ ట్రిప్పింగ్, ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్ కారణంగా వ్యవసాయ మోటార్లు సరిగా పనిచేయడం లేదన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటలకు నీరందించేందుకు విద్యుత్ అవసరముండగా సరఫరా అంతరాయాలతో పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక కాళోజి



**ధర్మారం, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి):**
ధర్మారం మండలంలోని పత్తిపాక జెడ్పీహెచ్ఎస్, మల్లాపూర్, నందిమేడారం గురుకుల పాఠశాల–కళాశాల, ధర్మారం ఆదర్శ పాఠశాల, శాయంపేట ప్రాథమిక పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రజాకవి పద్మవిభూషణ్ కాళోజి నారాయణరావు 112వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ తెలంగాణ భాషా దినోత్సవంగా కాళోజి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, భాషా, సంస్కృతుల పరిరక్షణకు కాళోజి చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సరిత, జాడి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ లు అరుణ, జి విజయ, ఉపాధ్యాయులు శ్వేత, శ్రీవాణి, వెంకటలక్ష్మి,విజయలక్ష్మి, రాణి, రుసేంద్రమని, శ్రీలత, పుష్ప, సంతోషిని తదితరులు పాల్గొన్నారు

## "కీర్తి చంద్రిక -- వెలుగుల ఉపాధ్యాయిని"

లెక్కల తరగతిలో వెలుగులు నింపిన
కీర్తి చంద్రిక గారు -- మీకు శుభాలు!
సంఖ్యల సందడిలో స్నేహం నేర్పిన
మీ మనసుకు రాష్ట్రం ఇచ్చే బిరుదులు!

గణితం అంటే భయం అనుకున్న పిల్లలకు
ఆటలా మార్చి ఆనందం పంచిన
ప్రతి సూత్రాన్ని ప్రేమతో బోధించి
జీవిత సత్యాలు నేర్పిన మేధావిని మీరు!
తెల్లవారు జామునే తరగతికి వచ్చి
చిన్నారుల కలలకు రెక్కలు కట్టిన
పాఠం చెప్పడమే ప్రాణంగా మార్చుకున్న
మీ త్యాగం చూసి మెచ్చుకుంది రాష్ట్రం!

బోధనలో ప్రతిభ, బాధ్యతలో నిబ్ధత
ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైతిరి.
తెలంగాణ తల్లి గర్వించే క్షణమిది.
కీర్తి పతాకం ఎగురవేసిన ఘడియిది!

సంఖ్యల సముద్రంలో దిక్కులు చూపిన
నక్షత్రం లాంటి మీ బోధనా పద్ధతి
పిల్లల భవిష్యత్తు ప్రకాశవంతం చేసిన
కీర్తి చంద్రిక -- మీరు చిరస్మరణీయులు!
ప్రభుత్వం ఇచ్చిన ఈ సత్కారానికి
అర్హులు మీరే --



అభినందనలు అందరికీ!
ఉపాధ్యాయుల దినాన ఉజ్వల కాంతులై
మరింత వెలుగులు నింపాలని కోరుకుంటున్నాము!

**K V RAVINDER LFL HM retired Patan cheru**

## దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం

**డిండి సెప్టెంబర్ 9( తెలంగాణ వాణి ప్రతినిధి)**



దళిత స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు సరైన పద్ధతి కాదని డిండి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మూడావత్ మల్లేష్ నాయక్ అన్నారు అయన మాట్లాడుతూలి, అసెంబ్లీలో దళిత స్పీకర్‌పై బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.
ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన శాసనసభలో స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. ముఖ్యంగా దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం సరికాదని అన్నారు.ఇలాంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలను, శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని, బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధులు తమ మాటతీరును మార్చుకోవాలని మల్లేష్ నాయక్ డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

## కేసీఆర్ దిష్టిబొమ్మ దహనంపై పోలీసులకు ఫిర్యాదు




**ధర్మారం, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి):**
మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను అవమానకరంగా దహనం చేశారంటూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అవమానించేలా దిష్టిబొమ్మ దహనం చేయడం అప్రజాస్వామికమని నాయకులు పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, సోషల్ మీడియా పోస్టులు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. బాధ్యులను గుర్తించి ఎఫ్ఐఆర్ నమోదు చేసి, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని ఎస్సై శ్రీకాంత్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచూరు శ్రీధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ కే బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ టి రాంబాబు, నాయకులు ఏ స్వామి, కె శ్రీనివాస్, ఐ వెంకటస్వామి, మల్లేశం నాయక్, అజ్మీర శ్రీనివాస్, రాము,డి వంశీ, తో పాటు మహిళా నాయకురాల్లు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

**సంగారెడ్డి, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి):**



ప్రైవేట్ కళాశాలకు అనుకూల నివేదిక ఇవ్వడానికి రూ.50 వేల లంచం డిమాండ్ చేసిన సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ఇప్పటికే రూ.30 వేలు తీసుకున్న అధికారి.. మిగిలిన రూ.20 వేల కోసం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని బృందం బుధవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయంలో దాడి చేసి, రూ.20 వేల లంచం తీసుకుంటుండగా గోవింద్ రామ్‌ను పట్టుకుంది. నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# బిగ్‌బాష్‌లోకి ప్రైవేట్ ఎంట్రీ

- ఐపీఎల్ ఓనర్లకు బంపర్ ఛాన్స్!
- ప్రైవేట్ పెట్టుబడులకు క్రికెట్ ఆస్ట్రేలియా గ్రీన్‌సిగ్నల్
- 2027-28 సీజన్ నుంచి కొత్త యాజమాన్య విధానం
- తొలుత మెల్‌బోర్న్ రెనెగేడ్స్ విక్రయానికి రంగం సిద్ధం
- ప్రపంచ టీ20 మార్కెట్‌లో ఐపీఎల్ యజమానులకు మరో అవకాశం
- నియంత్రణ మాత్రం క్రికెట్ ఆస్ట్రేలియా చేతుల్లోనే



**మెల్‌బోర్న్, సెప్టెంబర్ 9( తెలంగాణ వాణి):** ఆస్ట్రేలియా క్రికెట్‌లో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. దేశంలో అత్యంత ఆదరణ పొందిన బిగ్‌బాష్ లీగ్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరిచేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా సిద్ధమైంది. 2027–28 సీజన్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుండగా.. మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌ను తొలిసారిగా పూర్తిస్థాయి ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించే దిశగా అడుగులు పడుతున్నట్లు సమాచారం. ఈ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా పలు టీ20 జట్లను కలిగి ఉన్న ఐపీఎల్ ఫ్రాంచైజీ యజమానులకు మరో భారీ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఇప్పటివరకు ప్రపంచంలోని ప్రధాన టీ20 లీగ్‌లతో పోలిస్తే బిగ్‌బాష్‌లో ప్రైవేట్ ఫ్రాంచైజీ యాజమాన్యానికి అవకాశం లేకపోవడం ప్రత్యేకత. తాజా నిర్ణయంతో ఆ పరిస్థితి మారనుంది. అయితే బిగ్‌బాష్‌ను పూర్తిగా ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెట్టకుండా కీలక నియంత్రణలను క్రికెట్ ఆస్ట్రేలియానే కొనసాగించనున్నట్లు సమాచారం.

### ఐపీఎల్ ఓనర్ల కన్ను పడితే..!

ఐపీఎల్ జట్ల యజమానులు ఇప్పటికే దక్షిణాఫ్రికా, యూఏఈ, అమెరికా, వెస్టిండీస్, ఇంగ్లండ్ సహా వివిధ దేశాల్లోని టీ20 లీగ్‌ల్లో పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు ఆస్ట్రేలియా మార్కెట్ కూడా అందుబాటులోకి వస్తే ప్రపంచ టీ20 క్రికెట్‌లో వారి వ్యాపార సామ్రాజ్యం మరింత విస్తరించే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, ఆర్‌పీ-సంజీవ్ గోయెంకా గ్రూప్, జీఎంఆర్-జేఎస్‌డబ్ల్యూ వంటి సంస్థలు ఇప్పటికే వివిధ దేశాల్లో ఫ్రాంచైజీలను నిర్వహిస్తున్నాయి. బిగ్‌బాష్‌లోనూ జట్లను సొంతం చేసుకుంటే ఒకే యాజమాన్యం కింద వివిధ లీగ్‌ల్లో ఆటగాళ్లను కొనసాగించే వ్యూహాలకు మరింత అవకాశం లభించవచ్చు.

### ఒకే బ్రాండ్.. పలు లీగ్‌లు

కామెరాన్ గ్రీన్, టిమ్ డేవిడ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్ వంటి అంతర్జాతీయ ఆటగాళ్లను ఒకే యాజమాన్యానికి చెందిన ఐపీఎల్, ఎస్ఏ20, మేజర్ లీగ్ క్రికెట్, బిగ్‌బాష్ జట్లలో ఒప్పందాల ద్వారా కొనసాగించే అవకాశాలు పెరగవచ్చు. తద్వారా ఆటగాళ్ల నిర్వహణతో పాటు ఒకే బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించుకునేందుకు ఫ్రాంచైజీలకు అవకాశం ఉంటుంది. అయితే ఇక్కడే మరో సమస్య ఉంది. బిగ్‌బాష్ సాధారణంగా డిసెంబర్--జనవరిలో జరుగుతుండగా అదే సమయంలో దక్షిణాఫ్రికా ఎస్ఏ20, యూఏఈ అంతర్జాతీయ లీగ్ టీ20 కూడా జరుగుతాయి. ఒకే యాజమాన్యానికి వివిధ లీగ్‌ల్లో జట్లు ఉంటే స్టార్ ఆటగాళ్లను ఏ జట్టుకు కేటాయించాలన్న విషయంలో అంతర్గత పోటీ తప్పకపోవచ్చు.

### భారత స్టార్లకు మాత్రం నో ఎంట్రీ

ఐపీఎల్ యజమానులు బిగ్‌బాష్ జట్లను కొనుగోలు చేసినా భారత పురుష క్రికెటర్లను అక్కడ ఆడించడం ప్రస్తుత నిబంధనల ప్రకారం సాధ్యం కాదు. భారత క్రికెట్ నియంత్రణ మండలి తన క్రికెటర్లు విదేశీ టీ20 లీగ్‌ల్లో పాల్గొనేందుకు సాధారణంగా అనుమతించడం లేదు. అయితే భారత మహిళా క్రికెటర్లు గతంలో బిగ్‌బాష్‌లో పాల్గొన్నారు. భవిష్యత్తులో రిటైర్డ్ లేదా ఒప్పంద పరిధిలో లేని పురుష ఆటగాళ్ల విషయంలో భారత బోర్డు నిబంధనలు సడలిస్తే బిగ్‌బాష్‌లో పెట్టుబడులు పెట్టే భారత ఫ్రాంచైజీలకు అదనపు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.

### పగ్గాలు మాత్రం సీఏ చేతుల్లోనే

ప్రైవేట్ పెట్టుబడులకు అవకాశం కల్పించినా బిగ్‌బాష్‌పై క్రికెట్ ఆస్ట్రేలియా నియంత్రణ కొనసాగనుంది. అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్, ఆటగాళ్ల లభ్యత, ప్రసార హక్కులు, జీతాల పరిమితి వంటి కీలక అంశాల్లో బోర్డుదే ప్రధాన పాత్రగా ఉండనుంది. ఫ్రాంచైజీలను కొనుగోలు చేయాలనుకునే సంస్థలను ఆమోదించడం లేదా తిరస్కరించే అధికారం కూడా క్రికెట్ ఆస్ట్రేలియాకే ఉండనున్నట్లు సమాచారం. యాజమాన్య వైవిధ్యాన్ని కాపాడేందుకు ఒకే దేశానికి లేదా ఒకే వర్గానికి చెందిన సంస్థలు ఎన్ని జట్లను సొంతం చేసుకోవచ్చన్న అంశంలోనూ పరిమితులు విధించే అవకాశముంది. మొత్తానికి బిగ్‌బాష్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరుచుకుంటే ప్రపంచ టీ20 క్రికెట్ వ్యాపారంలో మరో కీలక మార్పునకు నాంది పడనుంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజీలను విస్తరిస్తున్న ఐపీఎల్ యజమానులకు ఆస్ట్రేలియా మార్కెట్ ఇప్పుడు కొత్త ఆకర్షణగా మారే అవకాశముంది.

# తెలంగాణ భాష మన ఆత్మగౌరవ ప్రతీక

**రాయికల్, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి):**
కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని రాయికల్ కేజీబీవీలో బుధవారం తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఓ శోభారాణి మాట్లాడుతూ తెలంగాణ భాష మన యాస కాదని, శ్వాస అని పేర్కొన్నారు. భాష, సంస్కృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థినులకు పద్య పఠనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కాళోజీ జీవిత చరిత్ర, తెలంగాణ కవులు, రచయితల గొప్పతనంపై అవగాహన కల్పించారు. జానపద, బతుకమ్మ పాటలు ఆలపించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.




# సంగం డెయిరీ షాపు ప్రారంభించిన పింగిలి రమేష్

**జమ్మికుంట, సెప్టెంబర్ 9,(తెలంగాణ వాణి ప్రతినిధి) :**
జమ్మికుంట పట్టణ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సంగం డెయిరీ షాపును ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్, పిఏసిఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా పింగిలి రమేష్ మాట్లాడుతూ.. సంగం డెయిరీ ద్వారా ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు, పాల పదార్థాలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు.



డెయిరీ నిర్వాహకులు శెట్టి అనిల్కు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడం పట్ల నిర్వాహకులను అభినందించారు.అనంతరం డెయిరీలో అందుబాటులో ఉన్న వివిధ రకాల పాల ఉత్పత్తులను కస్టమర్లకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పొనగంటి రాము శ్రీధర్, డెయిరీ నిర్వాహకులు, స్థానిక ప్రజలు, కస్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

**జమ్మికుంట, సెప్టెంబరు 9 (తెలంగాణ వాణి)**
: జమ్మికుంట ప్రభుత్వ బాలుర పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.క్రీడల్లో ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్లు సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు లభిస్తాయని తెలిపారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హేమలత, ఎస్ఐ రమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు ప్రేమలత, వి. శ్రీలత, రేణుక, ప్రవీణ్, శ్రీను, భగత్ తదితరులు పాల్గొన్నారు



Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com